# సాక్షి సూర్యాపేట

సోమవారం । 25 । మార్చి । 2024







**ఇల్లాలే సూత్రధారి !**
సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతోనే ఇల్లాలే ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించింది. - 8లో



**యాదాద్రిలో భక్తుల రద్దీ**
యాదాద్రిలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో భక్తులు భారీగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. - 10లో


**రంజాన్ వేళలు**

| | |
|---|---|
| ఇఫ్తార్ (సోమవారం సా॥) | 6-34 |
| సహర్ (మంగళవారం ఉ॥) | 4-54 |

## న్యూస్‌రీల్

### మంత్రి కోమటిరెడ్డి హోలీ శుభాకాంక్షలు



**నల్లగొండ:** రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో హోలి పండుగ ఆనందాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తూ.. జాగ్రత్తగా, ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలుతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు.

### శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యారాధనలు వైభవంగా కొనసాగాయి. దీంట్లో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈట నవీన్‌కుమార్, టీటీడీ బోర్డు డైరెక్టర్, హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, ఎన్ఎస్ఆర్,అంబటి శ్రీనివాసరెడ్డి, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలి



ఎస్పీ రాహుల్ హెగ్డే

**సూర్యాపేట క్రైం:** జిల్లా ప్రజలు సోమవారం హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. ఆదివారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా హోలీ ఆడాలని పేర్కొన్నారు. యువత ద్విచక్ర వాహనాలను విచ్చలవిడిగా, వేగంగా నడపవద్దని కోరారు. నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. ప్రార్థన మందిరాల వద్ద రంగులు చల్లవద్దన్నారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మహిళలను వేధింపులకు గురిచేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

### ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

**పెన్‌పహాడ్:** ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తూ.. జ్వరాల బారిన పడకుండా రక్షణ పొందాలని డీఎంహెచ్‌ఓ కోటాచలం అన్నారు. మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులకు డెంగీ సోకడంతో చికిత్స పొందారు. దీంతో ఆదివారం గ్రామంలో జ్వరపీడితుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఐదుగురు వ్యక్తుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. అవసరమైన వారికి మందులు అందించారు. కొందరు జ్వర పీడితులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, మండల వైద్యాధికారి స్రవంతి, హెచ్ఈఓలు చంద్రశేఖరరాజు, శ్రీనివాస్, సూపర్‌వైజర్ సైదయ్య, ఏఎన్ఎంలు సరిత, మణెమ్మ, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ధర్మాపురంలో జ్వరపీడితుల రిపోర్టు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

# కాసులిస్తే రైట్..

**అక్రమాలకు నిలయంగా నల్లబండగూడెం చెక్‌పోస్టు**

- ముడుపులిస్తే ఏ వాహనానికైనా అనుమతే..
- తెలంగాణ-ఆంధ్రాకు యథేచ్ఛగా సరుకు అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో పట్టించుకోని రవాణా శాఖ ఉన్నతాధికారులు



నల్లబండగూడెం వద్ద ఉన్న తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు రవాణా శాఖ చెక్‌పోస్టు

**కోదాడ:** అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లబండగూడెంకు సమీపంలో ఏర్పాటు చేసిన రవాణా శాఖ చెక్‌పోస్టు డబ్బుల వసూళ్లకు నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాసులిస్తే ఇక్కడ అంతా కరెక్ట్‌గానే ఉంటుందని, ఎలాంటి వాహనానికైనా, ఏ సరుకుకైనా ఇక్కడి అధికారులు రైట్ చెపుతారని వాహనదారులే అంటున్నారు. ఈ చెక్‌పోస్టు వద్ద రోజువారీ అక్రమ వసూళ్లు రూ.లక్షల్లో ఉంటాయనేది బహిరంగ రహస్యం. ఇక్కడ కొనసాగుతున్న అక్రమాలు, వసూళ్లను కప్పిపుచ్చుకోవడానికి పైస్థాయిలో ఉన్న 40 నుంచి 50 మంది అధికారులకు రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షలు నెలవారీ మామూళ్లు ఇస్తున్నారంటే ఇక్కడ వసూళ్ల పర్వం ఏ స్థాయిలో జరుగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

**అక్రమార్కులే బంగారు బాతులు**

అక్రమ దందా చేసే వారే ఈ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి బంగారు బాతులుగా ఉంటారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కాకినాడకు రేషన్ బియ్యం రవాణా చేసే లారీలు, ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను రవాణా చేసే వాహనాలు, ఆంధ్రా నుంచి తెలంగాణకు ఇసుకు రవాణా చేసే లారీలు, అధిక లోడ్‌తో వెళ్లే సిమెంట్ లారీలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, పర్మిట్ తీరిపోయిన వాహనాల నుంచి ఇక్కడి సిబ్బంది వేల రూపాయలు వసూలు చేస్తుంటారని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని సక్రమంగా ఉన్నా తమ నుంచి కూడా చెక్‌పోస్టు సిబ్బంది నిర్దేశించిన మొత్తాన్ని ముక్కుపిండి వసూలు చేస్తుంటారని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

**నెలవారీగా మామూళ్లు**

ప్రభుత్వ ఉద్యోగులకు కూడా మొదటి తేదీన వేతనాలు రావడం కష్టమే. కానీ ఈ చెక్‌పోస్టు వద్ద అక్రమాలు బయట పడకుండా కప్పిపుచ్చే వారికి ఇక్కడి సిబ్బంది మాత్రం ప్రతినెలా మొదటి తేదీనే మామూళ్లు ఇస్తున్నట్టు సమాచారం. వాహనదారుల నుంచి లంచాల రూపంలో నిత్యం వసూలు చేస్తున్న లక్షల రూపాయలను నెల రోజుల తరువాత ఒక దగ్గరకు చేర్చి పంపకాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి ఓ అధికారి బాధ్యతలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో చెక్‌పోస్టు వద్ద జరిగే వసూళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని పలువురు అంటున్నారు. గడిచిన ఏడెనిమిది సంవత్సరాల కాలంలో ఈ చెక్‌పోస్టులో మాత్రం ఒక్క అక్రమ రవాణా వాహనం పట్టుబడలేదు. దీన్ని బట్టే ఇక్కడ చెకింగ్ ఏ మాత్రం జరుగుతుందో తెలుస్తోంది.

**వసూళ్లకు భయపడి అడ్డదారిన..**

ఈ చెక్‌పోస్టు వసూళ్లను తట్టుకోలేక పలువురు అడ్డదారిలో తెలంగాణలోకి ప్రవేశిస్తున్నారు. ఆంధ్రా-తెలంగాణ సరిహద్దుకు మూడు కిలోమీటర్ల దూరంలో ప్రస్తుత చెక్‌పోస్టు ఉంటుంది. ఈ చెక్‌పోస్టును తప్పించుకోవడానికి కొందరు అక్రమార్కులు ఏపీ నుంచి తెలంగాణలోకి ప్రవేశించగానే రామాపురం క్రాస్ రోడ్డు ఉంటుంది. ఇక్కడ నుంచి లారీలు హైవే మీదుగా కాకుండా రెడ్లకుంట నుంచి కాపుగల్లు, గుడిబండ గ్రామాల మీదుగా కోదాడ బైపాస్‌కు చేరుకొని అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నాయి. మరో మార్గంలో ఆంధ్రాలోని జగ్గయ్యపేట, బలుసుపాడు, అన్నారం మీదుగా తెలంగాణలోని రెడ్లకుంటకు చేరుకొని అక్కడ నుంచి కాపుగల్లు, గుడిబండ మీదుగా కోదాడ బైపాస్‌కు చేరుతున్నాయి. ఈ రోడ్లు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నా నిఘా పెట్టకపోవడంతో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కోదాడకు చెందిన ఇద్దరు వ్యాపారులు ఈ మార్గంలో లారీలను రప్పించి కోదాడలో ఇసుక అమ్ముతున్నారు. వారం రోజుల క్రితం వీరి మధ్య బేధాలు వచ్చి ఒకరిమీ మరొకరు దాడులు చేసుకొవడంతో శుక్రవారం పట్టణ పోలీసులు వీరిని కోదాడ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిన విషయం విదితమే.

## • మట్టల మహోత్సవం



చివ్వెంల మండలం ఖాసింపేట గ్రామంలోని బెతెస్థ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన మట్టల పండుగలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ దుర్గం ప్రభాకర్, పాస్టర్లు, క్రైస్తవులు.

# వేసవి భత్యం లేనట్టేనా!

- రెండేళ్లుగా అందించని ప్రభుత్వం
- ఆశగా ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు



హుజూర్‌నగర్ మండల పరిధిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

**హుజూర్‌నగర్:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ పనులు చేస్తున్న గ్రామీణ కూలీలకు వేసవిలో అందించే అదనపు భత్యం రెండేళ్లుగా అందడం లేదు. మండే ఎండలో పనిచేస్తున్న కూలీల అవస్థలను గమనించిన ప్రభుత్వం రెండేళ్ల క్రితం వరకు అదనంగా వేసవి భత్యం అందించింది. అయితే 2022 నుంచి ఈ నిధుల మంజూరు నిలిచిపోయింది. ఈ ఏడాది అయినా ఇస్తుందేమో అని ఉపాధి కూలీలు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.61 లక్షల జాబ్ కార్డులకు గాను 5.70 లక్షల మంది ఉపాధి కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో నిత్యం 2.69లక్షల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు.

**నిబంధనల ప్రకారమైతే..**

ఉపాధి హామీ చట్టం ప్రకారం సగటున ఒక్కొక్కరికి రోజువారీగా కూలి రూ.272 అందేలా అధికారులు పని కల్పించాలనేది నియమం. మండు వేసవిలో పని చేసే కూలీల శ్రమను గుర్తించి ప్రభుత్వం వేసవిలో పని వేళలు తగ్గిండంతో పాటు ఏప్రిల్ మాసం నుంచి జూన్ మాసం వరకు మూడి నెలల పాటు వారికి అదనపు ప్రయోజనాన్ని చేకూర్చాలి. దీనిలో భాగంగా 2022కి ముందు ఇచ్చిన వేసవి అదనపు భత్యం ఉపాధి హామీ సాఫ్ట్‌వేర్ మార్పులు చేపట్టిన 2022 నుంచి అందడం లేదని కూలీలు వాపోతున్నారు. ఈ ఏడాదైనా భత్యం వస్తుందో.. రాదోనని కూలీలు చర్చించుకుంటున్నారు.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది**



ఉపాధి కూలీల అదనపు భత్యంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన తర్వాత దానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– జి.మధుసూదనరాజు, డీఆర్‌డీఓ, సూర్యాపేట

# చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించిన ఐసీడీఎస్ సిబ్బంది
- ఇటీవల అంగన్‌వాడీల్లో ముగిసిన 'పోషణ్ పక్వాడ'
- పోషక పదార్థాల తయారీపైన మహిళలకు పోటీలు
- 6,843 మంది పోషణ లోపం గల పిల్లల గుర్తింపు



హుజూర్‌నగర్ : పోషణ్ పక్వాడలో భాగంగా ప్రదర్శించిన చిరుధాన్యాలు (ఫైల్)

| | |
|---|---|
| ఐసీడీఎస్ ప్రాజెక్టులు | 05 |
| అంగన్‌వాడీ కేంద్రాలు | 1,209 |
| గర్భిణులు | 5,744 |
| బాలింతలు | 5,754 |
| 6 నెలలలోపు పిల్లలు | 5,814 |
| 7నెలల నుంచి మూడేళ్లు | 19,416 |
| 3-6ఏళ్లలోపు వారు | 18,612 |
| **పోషణ్ పక్షంలో గుర్తించిన పిల్లలు** | |
| తక్కువ బరువు ఉన్నవారు | 1,471 |
| అతితక్కువ బరువు ఉన్నవారు | 195 |
| వయస్సుకు తగ్గ ఎత్తులేనివారు | 3,427 |
| తీవ్ర కురుచదనం పిల్లలు | 923 |
| తీవ్ర పోషణ లోపం ఉన్నవారు | 706 |
| అతితీవ్ర పోషణ లోపం పిల్లలు | 121 |

**హుజూర్‌నగర్:** పిల్లలు, పెద్దలు ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సిబ్బంది సూచిస్తున్నారు. పేదరికం, నిరక్షరాస్యత, అవగాహన లేమితో సరైన మోతాదులో పోషకాహారం తీసుకోకపోవడం వల్ల అనేక రుగ్మతల బారిన పడుతున్న గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిస్థితిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నాయి. పౌష్టికాహారం తీసుకోవడంపై ఏటా పోషణ్ పక్వాడ పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. దీంట్లో భాగంగా ఈ ఏడాదికి సంబంధించి ఈనెల 9వ తేదీ నుంచి 23వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షం కార్యక్రమాలు నిర్వహించాలని ఐసీడీఎస్ యంత్రాంగం తలపెట్టింది. అయితే ఈనెల 16వ తేదీన లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపివేశారు.

**వారం రోజులే కొనసాగిన పోషణ్ పక్షం**

ఈనెల 9న ప్రారంభమైన పోషన్ పక్షం కార్యక్రమం అంగన్‌వాడీల్లో 23న ముగియాల్సి ఉండగా ఎన్నికల కోడ్ కారణంగా మధ్యలోనే నిలిపివేశారు. దీంతో పక్షం రోజులు కొనసాగాల్సిన కార్యక్రమం వారం రోజులే జరిగింది. ఈ వారం రోజుల పాటు ఐసీడీఎస్ సిబ్బంది అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలైన కొర్రలు, అరికెలు, జొన్నలు, సజ్జలు, రాగులు, కుసుమలు, అండుకొర్రలు తదితరాలతో చేసిన పదార్థాలను చిన్నారులకు ఆహారంగా తినిపిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆహార నిపుణులు సూచిస్తున్న ఈ నేపథ్యంలోనే వాటిపై జిల్లాలో అన్ని ఐసీడీఎస్ పాజెక్టుల పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వీటిలో అధిక శాతం విటమిన్ బీ-12, బీ-17, బీ-6, పీచు పదార్థాలు ఉంటాయి. కాబట్టి వీటిని నిత్యం ఆహారంలో తీసుకునేలా గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలతో ప్రచారం చేశారు. అలాగే చేతుల శుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులకు చిరుధాన్యాలతో పలురకాల ఆహార పదార్థాలు ఎలా చేయాలో నేర్పించారు. వారికి వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రక్త హీనతకు గురైతే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఎదురయ్యే సమస్యలను వివరించారు. వయస్సుకు తగ్గ ఎత్తు, బరువులేని పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించారు.

### విద్యా వ్యవస్థను మెరుగుపర్చాలి

**నల్లగొండ:** విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం యూటీఎఫ్ వ్యవస్థాపకుడు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అధ్యక్షతన ×ఉపాధ్యాయ ఉద్యమం-నేటి సవాళ్లు₹ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో నర్సిరెడ్డి మాట్లాడారు. పదేళ్ల కాలంలో పాఠశాల విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పాఠశాల విద్యలో ప్రమాణాలు తగ్గిపోయాయన్నారు. వెంకటస్వామి లాంటి నాయకులు నిస్వార్థమైన సేవలు అందించడం వల్ల నేడు ఉపాధ్యాయులు మెరుగైన వసతులు అనుభవిస్తున్నారని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధాన పత్రం విద్యను కాషాయీకరించే విధంగా ఉందన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తీసుకోవాల్సిన కర్తవ్యాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్ రెడ్డి, జి.నాగమణి, జి.రాంబాబు, పి.వెంకటేశం, శ్రీనివాసాచారి, అరుణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


### నృసింహుడికి పూజలు




కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. సుప్రభాతం, ఆరాధనతో పాటు శ్రీస్వామి, అమ్మవారికి నిజాభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో ఉత్తవ మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవలను ఊరేగించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించారు.

# ఎండుతున్న వరి.. దరిచేరని గోదారి



రామన్నగూడెం గ్రామంలో ఎండిన వరిపొలం




నీళ్లు రాకపోవడంతో వెలవెలబోతున్న 71డీబీఎం కాల్వ

- రెండు రోజులు గడుస్తున్నా రాని చివరి విడత జలాలు
- ఎదురుచూపుల్లో అన్నదాతలు

**అర్వపల్లి:** యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాకు వారబందీ విధానంలో చివరి విడతగా (ఆరో విడత) రావాల్సి గోదావరి జలాల ఊసేలేకుండా పోయింది. షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి జిల్లాకు అందాల్సిన నీరు రెండు రోజులు గడుస్తున్నా వదలలేదు. దీంతో వరిసాగు చేసిన రైతులు తమ పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఆరో విడతగా శనివారం నుంచి ఈనెల 30 వరకు గోదావరి జలాలు రావాల్సి ఉంది. కానీ, పైనుంచి నీటిని విడుదల చేయకపోవడంతో జిల్లాకు మొదలు కాలేదు. చివరి విడత పంటలకు నీళ్లు వస్తాయో రావోనని అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. ఈ విడత నీటి విడుదలపై నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఒక్క విడతైనా నీటిని వదిలి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# రాచకొండపై ఆశలు



రాచకొండలో ప్రకృతి అందాలు

**అభివృద్ధిపై ఇటీవల ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి**

- గత ప్రభుత్వ హయాంలో ఫిలిం సిటీ, టెంపుల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ వంటి ప్రతిపాదనలు
- కార్యరూపం దాల్చని నాటి సీఎం హామీలు
- రేవంత్ ప్రకటనతో ఈ ప్రాంత అభివృద్ధిపై మళ్లీ చర్చ

**సంస్థాన్ నారాయణపురం :** ఘనమైన చరిత్ర కలిగి, రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలో ఉన్న రాచకొండ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడడం లేదు. ఫిలిం సిటీ, స్పోర్ట్స్ సిటీ, నెమళ్ల పార్కు, రోప్‌వే వంటివి ఏర్పాటు చేసి రాచకొండకు పూర్వ వైభవం తీసుకొస్తామని నాటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. రాచకొండను హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి.

**35వేల ఎకరాల్లో విస్తరించిన రాచకొండ**

రాచకొండ ఏడు శతాబ్దాల క్రితం తెలంగాణ ప్రాంతానికి రాజధాని. రాచర్ల పద్మనాయకులు ఈ ప్రాంతాన్ని రాజధానిగా చేసకొని పాలన సాగించారు. యాద్రాద్రి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలో 35 వేల ఎకరాల్లో రాచకొండ ప్రాంతం విస్తరించి ఉంది. హైదరాబాద్‌కు 40 కి.మీ, శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 25 కి.మీటర్ల దూరంలోనే ఉంటుంది. అయినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్రం నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరకు రాచకొండ అభివృద్ధికి అనేక ప్రతిపాదనలు చేసినా ఏ ఒక్కటీ కార్యరూపందాల్చలేదు.

**అభివృద్ధి కోసం ప్రతిపాదనలు**

ప్రకృతి రమణీయత, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలకు పెట్టింది పేరు.. రాచకొండ ప్రాంతం. నాటి సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేసి రాచకొండ ప్రాంతాన్ని పరిశీలించారు. రాచకొండలో నెమళ్ల పార్కు, టెంపుల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఐటీ పార్కు, కృషి విజ్ఞాన కేంద్రం, ట్రెక్కింగ్, రోప్‌వే, ఇండస్ట్రియల్ కారిడార్ వంటి ప్రతిపాదనలు చేశారు. వీటితో పాటు రెండు వేల ఎకరాల్లో ఫిలిం సిటీ ఏర్పాటు, హైదరాబాద్ నుంచి, శంషాబాద్ నుంచి, హైదరాబాద్ - విజయవాడ హైవే నుంచి నాలుగు లేన్ల రోడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు చేసినాఅమలు కాలేదు. మెట్లబావికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి వెళ్లిన పమేలా సత్పతి ప్రయత్నం చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.ప్రభాకర్‌రెడ్డి సహకారంతో బావి అభివృద్ధికి చర్యలు చేపట్టినా పూడిక తీయడంతోనే నిలిచిపోయింది.

**ఏం అభివృద్ధి జరిగిందంటే..**

- రాచకొండ ప్రాధాన్యతను వెలుగులోకి తీసుకురావడానికి దేశంలోనే రెండవ అతిపెద్ద సైబరాబాద్ ఈస్ట్ కమిషనరేట్‌కు అప్పటి ప్రభుత్వం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌గా నామకరణం చేసింది.
- ఆటవీ శాఖ నిధులు రూ.80 లక్షలతో వ్యూ పాయింట్, ప్రధాన ద్వారం వద్ద ప్రవేశ రుసుం కౌంటర్లు ఏర్పాటు.
- దర్గా నుంచి రాచకొండ కోట వరకు రోడ్డు నిర్మాణం, చెరువుల మరమ్మతులు.
- వివిధ రకాల పూలు, గడ్డి జాతి మొక్కలతో పాటు విభిన్న రకాల వృక్షాలు పెంపకం.
- అప్పటి రాచకొండ సీపీ మహేష్‌భగవత్ ఇన్ఫోసిస్ కంపెనీ సహకారంతో రూ.10లక్షలతో సైన్‌బోర్డుల ఏర్పాటు చేయించారు.
- రాచప్ప సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం పునరుద్ధరణ.
- శివాలయం వద్ద భక్తులకు అన్నదానం చేయడానికి షెడ్ నిర్మాణం.
- రాచప్ప సమితి ఆధ్వర్యంలో ఏటా పర్యాటక ఉత్సవాల నిర్వహణ.

**రూ.100 కోట్లు కేటాయించాలి**

ప్రభుత్వం దృష్టి సారిస్తే రాచకొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చు. టెంపుల్ సిటీగా, ఫిలిం సిటీగా తీర్చిదిద్దవచ్చు. ఎంతో ఘన చరిత్ర ఉన్న రాచకొండ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి. మౌలిక వసతులు కల్పించడంతో పాటు చారిత్రక కట్టాడాలను పరిరక్షించాలి. కోటను అభివృద్ధి చేయాలి. నిధుల కోసం ఇప్పటికే రాచప్ప సమితి కేంద్రానికి విన్నవించింది.

– వెంకటేశం, రాచప్ప సమితి ప్రతినిధి

## క్లుప్తంగా

### హోలీ శుభాకాంక్షలు



నల్లగొండ: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మోదుగుపూల వంటి సహజమైన రంగులతో హోలీ జరుపుకోవాలని సూచించారు.

### టిప్పర్ వాహనంలో మంటలు

దేవరకొండ: టిప్పర్ వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో దాదాపు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లింది. అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. టిప్పర్ వాహనానికి మరమ్మతులు చేయించేందుకు దేవరకొండ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మండల పరిధిలోని శేరిపల్లి గేటు సమీపంలోకి రాగానే మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని నిలిపి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పాలు. అప్పటికే టిప్పర్ వాహనం టైర్లు కాలిపోయాయి. ఈ ఘటనలో రూ.3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని ఫైర్ ఎస్‌ఐ రాజునాయక్ తెలిపారు.

### కారు ఢీకొని వృద్ధురాలు మృతి

కొండమల్లేపల్లి : కారు ఢీకొని వృద్ధురాలు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దేవరకొండలో చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి చందంపేట మండలంలోని వైజాక్ కాలనీకి వెళ్తున్న కారు మార్గమధ్యలో దేవరకొండలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఆర్టీసీ బస్సు కోసం వేచి ఉన్న డిండి మండలంలోని దాసరినెమలిపూర్ గ్రామానికి చెందిన రమావత్ మేరి(65)తో పాటు మరో ఇద్దరిని ఢీకొట్టింది. ప్రమాదంలో మేరి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మృతురాలి మనుమడు రమావత్ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

### జాతీయస్థాయిలో అనుముల కీర్తిని పెంచాలి

హాలియా : జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారులు తమ నైపుణ్యాలతో అనుముల మండల కీర్తి ప్రతిష్టలను పెంచాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్రీడాదినోత్సవం సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆకాంక్ష ప్లేవే స్కూల్‌లో జాతీయస్థాయి క్రీడాకారులైన ఎస్‌కె అయేషా, ఎండీ అపషా, ఆవుల కార్తీక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. కబడ్డీ క్రీడాకారులకు తన వంతుగా ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. క్రీడాకారులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి పేరు ప్రతిష్టలను తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు యడవెల్లి రాంబాబు, చనగల ఎల్లయ్య, పీఈటీ కాకునూరి రమేష్‌గౌడ్, అనుముల మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, మంగ్యానాయక్, కబడ్డీ కోచ్ ఎండీ అన్వర్, పీఈటీలు అనిల్, లింగస్వామి, సతీష్, రాము, నరేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

### బీసీలను మోసం చేసిన రాజకీయ పార్టీలు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ పార్లమెంట్ టికెట్ కేటాయింపులో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేశాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంటు టికెట్లను బీసీలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డిలకు ఈ ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకు కేటాయించి బీసీలను తీవ్రంగా మోసం చేశాయని ఆరోపించారు. ప్రతి ఎన్నికల్లో ఆ రాజకీయ పార్టీలు సీట్ల వద్దకు వచ్చే సరికి సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నాయన్నారు. బీసీలకు సీట్ల కేటాయింపులో మోసం చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీసీలను కోరారు.

# ఇల్లాలే సూత్రధారి!




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య
- సఖ్యతకు అడ్డొస్తున్నాడనే ఘాతుకం
- వీడిన హత్య కేసు మిస్టరీ
- సూత్ర, పాత్రధారుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లి శివారులోని వ్యవసాయ బావిలో ఇటీవల వెలుగుచూసిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతోనే ఇల్లాలే ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఫోన్ కాల్ డేటా ఆధారంగా కూపీలాగిన పోలీసులు కేసును ఛేదించి సూత్ర, పాత్రధారులను అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన వనం ఈశ్వర్ (33)కు టేకుమట్ల గ్రామానికి చెందిన దాసరి ఎల్లయ్య కూతురు నవ్యతో 2015లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కూతురు, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

**అడ్డుతొలగించుకుంటే సఖ్యతగా మెలగొచ్చని..**

ఈశ్వర్ ఇంటి పక్కన మద్యం దుకాణంలో పనిచేస్తున్న కానుగు సతీష్‌తో కొంతకాలం క్రితం నవ్యకు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం ఈశ్వర్‌కు తెలువడంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈశ్వర్ అడ్డుతొలగించుకుంటే సతీష్‌తో సఖ్యతగా మెలగొచ్చని నవ్య నిర్ణయించుకుంది. ఇదే విషయాన్ని ప్రియుడు సతీష్‌కు చెప్పింది. హత్యకు సుపారీ మాట్లాడాలని సూచించింది. సతీష్ తన బంధువు అయిన నక్కా వీరస్వామితో హత్య విషయమై చర్చించారు. హత్యకు అంగీకరించిన నక్కా వీరస్వామి రూ.2లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. నవ్య ముందస్తుగా 2 తులాల బంగారం గొలుసును ప్రియుడు సతీష్‌కు ఇచ్చింది. దీంతో వీరస్వామి తనకు తెలిసిన ధనావత్ హనుమానాయక్, ధనావత్ సాయిలుతో కలిసి ఈశ్వర్‌ను హత్య చేసేందుకు సహకరిస్తే రూ. 40 వేలు ఇచ్చేట్లుగా ఒప్పందం చేసుకున్నాడు.

**నమ్మించి.. గొంతు నులిమి**

కట్టంగూర్ మండలం అంబటివాగు గ్రామానికి చెందిన కానుగు సతీష్, డ్రైవర్‌గా పనిచేస్తూ మిర్యాలగూడ పట్టణం రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఎర్రకుంట గ్రామానికి చెందిన నక్కా వీరస్వామి, మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ధనావత్ హనుమానాయక్, త్రిపురారం మండలం బడాయిగడ్డ తండాకు చెందిన ఆటో డ్రైవర్ ధనావత్ సాయిలు కొద్ది రోజుల క్రితం ఈశ్వర్ హత్యకు పథకం వేశారు. ఈ నెల 16న ఈశ్వర్ భార్య పిల్లలతో కలిసి బైక్‌పై టేకుమట్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో నకిరేకల్ దాటిన తర్వాత ఈశ్వర్ బైక్ ఆగిపోవడంతో భార్య పిల్లలను ఆటోలో టేకుమట్లకు పంపించాడు. వీరి వెనుకాలే సతీష్, నక్కా వీరస్వామిలు బైక్‌పై అక్కడికి వచ్చారు. ఈశ్వర్ బైక్ మరమ్మతుకు సహకరించిన వీరస్వామి అతడితో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం నకిరేకల్ వైన్ షాప్‌లో ఈశ్వర్‌కు బీరు తాపి ఫోన్ నంబర్ తీసుకున్నాడు. మరుసటి రోజు ఈశ్వర్‌కు ఫోన్‌చేసి నల్లగొండకు వెళదామని చెప్పాడు. నమ్మి ఈశ్వర్ వీరస్వామి చెప్పినట్లుగా రావడంతో అప్పటికే కిరాయికి తెచ్చుకున్న కారులో నల్లగొండకు తీసుకొచ్చాడు. నల్లగొండలో బస్టాండ్ వద్ద ధనావత్ సాయి, హనుమానాయక్‌ను బస్టాండ్ వద్ద కారులో ఎక్కించుకుని కట్టంగూర్ రోడ్డుకు తీసుకెళ్లారు. ముందు సీటులో కూర్చున్న ఈశ్వర్‌ను వెనుక కూర్చున్న ధనావత్ హనుమానాయక్, సాయిలు తాడుతో గొంతుకు ఉరి బిగించారు. ఊపిరి ఆడకుండా చేయడంతో పాటు గొంతుపై కాళ్లు పెట్టి తొక్కి చేతులతో గొంతు నులిమి హత్య చేశారు. అనంతర మృతదేహాన్ని తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లి వద్ద వ్యవసాయ బావిలో పడేసి ఎవరింటికి వారు వెళ్లిపోయారు.

**ఫోన్ కాల్‌డేటా ఆధారంగా..**

అనిశెట్టి దుప్పలపల్లి శివారులోని వ్యవసాయ బావిలో 18న మృతదేహాన్ని గమనించిన రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. వివిధ పత్రికల్లో , సోషల్ మీడియాలో కథనాలు రావడంతో మృతుని కుటుంబ సభ్యులకు విషయం తెలిసింది. దీంతో పోలీసులు హతుడి ఫోన్ నంబర్ ఆధారంగా చివరి కాల్ ఎవరు చేశారు. భార్య ఫోన్ కాల్ డేటాను పోలీసులు విశ్లేషించారు. కుటుంబ సభ్యులతో మరిన్ని వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేపట్టగా నవ్య ప్రియుడితో కలిసి హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో పోలీసులు సూత్ర, పాత్రధారులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. వారి నుంచి కారు, 2 తులాల బంగారం, 2 బైక్‌లు, 20 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసిన రైటర్లు రాజీవ్, ముజీబ్, సిబ్బంది సురేష్, ఖలీల్‌ను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి ఎస్‌ఐ రాజు పాల్గొన్నారు.

# మద్యం దుకాణంలో చోరీ

- రూ.3.45లక్షలతో పాటు మద్యం బాటిళ్లు అపహరణ
- సీసీ ఫుటేజీలో రికార్డయిన దుండగుల కదలికలు

తుర్కపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మాదాపూర్ రోడ్డులో ఉన్న దుర్గా వైన్స్ షాప్ షట్టర్‌ను ఆదివారం తెల్లవారుజాము 2గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు గడ్డపారలతో లేపి చొరబడ్డారు. దుకాణం కౌంటర్‌లో ఉన్న రూ.3.45లక్షలతో పాటు పలు కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను అపహరించుకుపోయారు. ఆదివారం ఉదయం 9 గంటలకు దుకాణం తెరిచేందుకు సిబ్బంది రావడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ కొండల్‌రావు, ఎస్‌ఐ తక్యూద్దిన్ సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. వైన్స్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దుండగులు తెరిచిన దుకాణం షట్టర్




సీసీ ఫుటేజీలో రికార్డయిన గుర్తుతెలియని వ్యక్తులు

# ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

సూర్యాపేట క్రైం : సూర్యాపేట ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం నవజాత శిశువు మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కన్నపేగు కనుమూసిందని తల్లిదండ్రులు ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామానికి చెందిన కలపల్లి సంపత్, యోగితా దంపతులు కాన్పు కోసం శనివారం ఉదయం 4గంటలకు రాగా అదే రోజు రాత్రి 8గంటలకు మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10గంటలకు టీకా వేయడంతో అప్పటి వరకు క్షేమంగా ఉన్న పసికందు అస్వస్థతకు గురై మృతిచెందిందని వాపోయారు. వైద్యులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ఆస్పత్రి ఎదుట ఆందోళన**

సూర్యాపేట : నవజాత శిశువు మరణానికి కారణమైన వైద్యులపై క్రిమినల్ కేసు పెట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోలేక పేదలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటే వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చనిపోయిన శిశువు కుటుంబానికి రూ. 50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, పీఓడబ్ల్యూ సహకార్యదర్శి ససూరం రేణుక, సయ్యద్ వీరబాబు పాల్గొన్నారు.



ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

# రెండేళ్లకే నూరేళ్లు!

- క్రేన్ ఢీకొని బాలుడు మృతి

కొండమల్లేపల్లి : క్రేన్ ఢీకొని రెండేళ్ల బాలుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలోని కోల్‌ముంతల పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బాపూజీనగర్ గ్రామంలో 167వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇంటిలో రమావత్ బాలు నివాసం ఉంటున్నాడు. ఇతడి కుమారుడు రమావత్ ప్రేమ్ (2) ఇంటి ఆవరణలో రోడ్డుకు సమీపంలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో అకస్మాత్తుగా వచ్చిన క్రేన్ ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి తండ్రి రమావత్ బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.



ప్రేమ్ (ఫైల్)

### కారు, బైకు ఢీ.. పలువురికి గాయాలు

వలిగొండ : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం దుప్పెల్లి స్టేజి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి మోత్కూర్ వెళుతున్న కారు దుప్పెల్లి స్టేజి వద్ద పాలడుగు చెందిన భిక్షంరెడ్డి స్కూటీని ఢీకొట్టి బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ఉన్న శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, పద్మావతితో పాటు భిక్షంరెడ్డికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు భువనగిరి ఆస్పత్రికి తరలించారు.

### రాతి కడీలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

కట్టంగూర్ : రాతి కడీలను ధ్వంసం చేసిన వ్యక్తి కట్టంగూర్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. చౌటుప్పల్ మండలం ఎల్లంబావికి చెందిన కె.రవీందర్‌రెడ్డి కుటుంబానికి ఈదులూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 40 ఎకరాలకు భూమి ఉంది. హైదరాబాదుకు చెందిన ఆర్.కొండల్‌రెడ్డి భూతగాదాలను మనసులో పెట్టుకొని ఈ నెల 21న తన అనుచరులతో కలిసి రవీందర్‌రెడ్డికి చెందిన సుమారు 1500 కడీలను ధ్వంసం చేశారు. రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కొండల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

### చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

మద్దిరాల : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి చెక్ పోస్టు వద్ద ఎఫ్‌ఎస్‌టీ టీం సిబ్బంది ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి గ్రామానికి చెందిన ఆర్.రాజలింగం సూర్యాపేటకు తన వాహనంలో తరలిస్తున్న రూ.60,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మధునాయుడు, ఎఫ్‌ఎస్‌టీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

**అనంతారం క్రాస్ రోడ్డు వద్ద..**

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిలకలూరిపేటకు చెందిన వ్యక్తులు కారులో రూ. 69వేల నగదును తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పెరిక రవీందర్ తెలిపారు.



నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎఫ్‌ఎస్‌టీ సిబ్బంది

### హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

మేళ్లచెరువు : హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన గోపిశెట్టి శంకర్‌కు చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన శంషద్‌తో భూ తగాదాలు ఉన్నాయి. శంషద్ కొంతకాలంగా తన భార్యతో సఖ్యతగా మెలుగుతున్నాడని అనుమానించాడు. దీంతో శంషద్‌పై కక్ష పెంచుకుని అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 19వ తేదీ రాత్రి 7గంటల సమయంలో శంషద్ మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉండగా గోపిశెట్టి శంకర్ గొడలితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

నార్కట్‌పల్లి : అదృశ్యమైన వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామ శివారులో ఆదివారం ఈ ఘటన వెలుగుచూసింది. డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ(63) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 21న రాత్రి ఇంట్లో పడుకున్న పిచ్చమ్మ మరుసటి రోజు ఉదయం నుంచి కనిపించకుండాపోయింది. గ్రామ శివారులోని నీరులేని పడావు బావిలో వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పిచ్చమ్మగా గుర్తించారు. మృతురాలి ఒంటిపై గాయాలు ఉండడంతో ఆమె మరణంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.



పిచ్చమ్మ (ఫైల్)

# పర్యావరణాన్ని పరిరక్షించాలి

నాగార్జునసాగర్ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, నీటిని పొదుపుగా వాడాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి సూచించారు. జిల్లాలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలనుంచి ఎంపిక చేసిన 50 మంది విద్యార్థినులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు డీఈఓ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో చేపట్టిన నేచర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. క్యాంపులో భాగంగా విద్యార్థినులు సాగర్‌లోని నెల్లికల్లు అర్బన్‌పార్కు, బుద్ధవనం, విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించారు. క్యాంపు ముగింపు సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి మాట్లాడుతూ భారత ప్రభుత్వం, అడవులు సుస్థిర అభివృద్ధి మంత్రిత్వశాఖ న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జాతీయ హరితదళాలు హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రత్యేకంగా గుర్తించిన పాఠశాలలనుంచి విద్యార్థులను తీసుకొచ్చి అడవులు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజురోజు అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల మానవ మనుగడకు ఉపయోగపడే జంతువులు, పక్షులు, కీటకాలు అంతరించి పోతున్నాయన్నారు. పరిసరాలు గాలి, నీరు, నేల కాలుష్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్ రాజశేఖర్, గైడ్ ఉపాధ్యాయులు రమాదేవి, అలివేలు, ఆకుల సునీత, చంద్రకళ పాల్గొన్నారు.



అర్బన్‌పార్కు వ్యూపాయింట్ వద్ద విద్యార్థినులు

### బెల్టు దుకాణాలపై పోలీసుల దాడి

భువనగిరి క్రైం : భువనగిరి మండల పరిధిలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్న బెల్టు దుకాణాపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వడాయిగూడెం, అనంతారం, బీఎన్ తిమ్మాపురం గ్రామాల్లోని బెల్టు షాపులపై దాడి చేసి 131 లీటర్ల మద్యం సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# కల్యాణోత్సవానికి ఎర్రబెల్లి గుట్ట ముస్తాబు

నిడమనూరు : జాతర సందర్భంగా ఎర్రబెల్లి లింగమంతుల స్వామి గుట్టను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం రాత్రి 2గంటల తర్వాత మానిక్యాలదేవి–లిగమంతుల స్వామిల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. కల్యాణోత్సవానికి ముందుగా మానిక్యాలదేవికి తల్లిగంపతో వేడుక నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునస్వామి వారి కల్యాణోత్సవం అనంతరం ఉదయం 8గంటలకు నైవేద్యం(బోనాలు) సమర్పించనున్నారు. ఉమ్మడి నల్లగొండతో పాటు చుటుపక్కల జిల్లాలకు చెందిన యాదవులు, భక్తులు మూగజీవాలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. గుట్ట చుట్టూ వ్యారస్తులు గుడారాలు వేశారు. గుట్టకు, మొట్లకు, కల్యాణ మండపానికి విద్యుత్ దీపాలను అలంకించారు.



ఎర్రబెల్లిలో విద్యుత్ దీపాలతో శివపార్వతులు



### మహిళ అదృశ్యం

మోతె : మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మోతె మండల పరిధిలోని కూడలి గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. కూడలి గ్రామానికి చెందిన బోగ వెంకటమ్మ ఈ నెల 20న తన తండ్రి సత్తయ్యతో గొడవపెట్టుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. నాలుగు రోజులుగా బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంకటమ్మ భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కూసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేంద్రరెడ్డి తెలిపారు.

### చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల అమీర్ ఆర్ట్స్ అకాడమి నెల్లూరువారు నిర్వహించిన ఆలిండియా చిల్డ్రన్ ఆర్ట్స్ కాంటెస్ట్‌లో విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ప్రతిభను కనబరిచిన వారిలో డ్రాయింగ్ క్లాస్‌కు చెందిన మూడో తరగతి చదువుతున్న ఎం. అద్వైత, పి. ఆధ్య, ఎనిమిదో తరగతి చదువుతున్న కె. రిత్విక్‌రెడ్డిలు వేసిన చిత్రాలకు బంగారు పథకాలతో పాటు సర్టిఫికెట్లు లభించాయని చిత్రకారుడు యినుగుర్తి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభను కనబర్చిన విద్యార్థులను స్థానిక ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.



చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

# గూడు చెదిరిన పేద బతుకులు

- తొమ్మిదేళ్ల క్రితం ప్రమాదవశాత్తు కాలిబూడిదైన పూరిల్లు
- రూ.4లక్షల నగదు, సామగ్రి, ధ్రువపత్రాలు బుగ్గిపాలు
- అప్పటి నుంచి పూరి గుడిసెలోనే నివాసం
- గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు



తొమ్మిదేళ్ల క్రితం కాలిబూడిదైన గుడిసె (ఫైల్)



గుడిసెలో నివాసం ఉంటున్న దంపతులు

మునగాల: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూరిల్లు దగ్ధమై తొమ్మిదేళ్లుగా గుడిసె జీవితం అనుభవిస్తున్నారు ఆ పేద దంపతులు. గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు మునగాల మండలం నారాయణగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డం కోటిలింగం–సైదమ్మ దంపతులు. గడ్డం కోటిలింగం కుటుంబం వృత్తిరీత్యా గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. 2015లో తన గొర్రెలను అమ్మగా వచ్చిన రూ.4 లక్షల నగదుతో ఇల్లు కట్టుకునేందుకు పూరింట్లో ఉంచాడు. అయితే కోటిలింగం ఇంటి ఎదుట ఉన్న విద్యుత్ స్తంభంపై తీగలు షార్ట్ సర్క్యూట్ అయి గుడిసె మీద నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో మంటలు లేసి పూరిల్లుతోపాటు ఇంట్లో ఉన్న రూ.4 లక్షల నగదు, సామగ్రి, 50బస్తాల వరిధాన్యం, భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బట్టలు, ఇతర ధ్రువీకరణపత్రాలు సైతం కాలి బూడిదయ్యాయి. దీంతో అప్పట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చినా అది నెరవేరలేదు. అప్పటి ప్రభుత్వం కూడా ఏ సాయం చేయలేదు. ఫలితంగా కోటిలింగం కుటుంబం తొమ్మిదేళ్లుగా అదే స్థలంలో మరో గుడిసె వేసుకొని జీవనం సాగిస్తోంది. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నానని, మరోవైపు ఆరోగ్యం సహకరించకపోవడం కుటుంబ పోషణ భారంగా మారిందని కోటిలింగం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా గృహలక్ష్మి పథకం కింద తమకు ఇల్లు మంజూరు చేస్తుందో.. లేదోనని కోటిలింగం కుటుంబం ఆశతో ఎదురుచూస్తోంది.

**ఇల్లు మంజూరు చేయాలి**



తొమ్మిదేళ్ల క్రితం పూరిల్లుకు నిప్పంటుకొని నగదుతో సహా సామగ్రి మొత్తం కాలిబూడిదై సర్వం కోల్పోయాము. అప్పట్లో ఇల్లు కట్టించి ఇస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదు. తొమ్మిదేళ్ల నుంచి పూరిగుడిసెలోనే ఉంటున్నాం. ప్రభుత్వం స్పందించి ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– గడ్డం సైదమ్మ, నారాయణగూడెం